# కావ్య సుందరి కథ

కిష్టమూర్తికి ఎన్నో కోర్కెలు తీరకుండానే గడ్డి మొక్కల్లా కాలాన్ని వృధా చేసి గతంలోకి జరిగి, వాడి వరిగిపోయేవి. మళ్ళీ కొత్త వూహలు చిగురించి మనస్సును మభ్యపెట్టి మాయమయ్యేవి.

ప్రతిసారి తన రచన పుస్తకంలో పడినప్పుడు వూహల్లో కోరికలు పెరిగి ప్రకృతిని చీరలా చుట్టుకు -- నీలాకాశం మేలి ముసుగులా కప్పుకు నక్షత్రాల గుంపులో కోరికలని ఏరుకునే తన పాత్రలని మెచ్చుకొనాలని, పరిసరాల మనుష్యుల్లోని వివేకాన్ని వెతికేవాడు. తనకు వున్న స్నేహితులు చాలా తక్కువే. ఐనా, ఒకరిద్దరు చిన్ననాటి స్నేహితులు విడవకుండా క్షేమం తెలుసుకుంటూనే వుంటారు.

తనకి ఉద్యోగ మేమిటి, అన్న ప్రశ్న చాలాసార్లు మనస్సుని నిలమెట్టి కోప్పడ్డా, మొదట్లో అన్నా, అమ్మా ఆ ప్రశ్నని వాకిట్లోంచే తరిమేసేవారు.

ఎప్పుడైనా చీకట్లో వంటరిగా కూర్చుంటే తనకి దుఃఖం వచ్చేది. అది అందరికీ పంచితేసరి అన్నకసితో, కాయితాలు కుప్పవేసుకుని, ఎంతో దుఃఖాన్ని వ్రాసి పత్రికలకి పంచి పెట్టాడు. అంత దుఃఖాన్ని ఒక్కసారి ప్రజల మీద వదిలితే, తట్టుకోలేరన్న సత్యం, ఎరిగిన అధిపతులు దస్త్రాలకింద దాచి పెట్టారు. కాలం, దస్త్రాలను సహితం ఖాళీచేసేశాక కిష్టమూర్తి బయటపడక తప్పలేదు.. కూడబలుకున్నట్లు కొన్ని పత్రికల్లో ఒక్కసారే కిష్టమూర్తి పేరు పడేసరికి కొంచెము చుట్టుపక్క మనుషులతో కదలిక కలిగింది. అన్నట్టు మీ పేరు ఫలాని పత్రికలో చూసినట్టు వున్నానండీ, అన్న బస్టాండు ఫ్రండుని పళ్ళూడగొట్టాలనిపించింది.

చూడ్డమేమిటి వాడి మొహం. చదివానంటే వాడి బోడి గొప్పకి తక్కువ కాబోలు. ఛీ అనుకున్నాడు.

ఇంటికి వుసూరుమంటూ చేరేసరికి తనకింద పని చేసే అసిస్టెంట్సు నలుగురూ మంచంకోళ్ళల్లా అరుగుమీద కూర్చున్నారు. వాళ్ళని చూడగానే తన పై అధికారి తన్ని పట్టుకురమ్మన్నాడేమోనన్న వూహవచ్చి గుండెని నీరసంలోకి దింపేసింది. ఏమిటన్నట్లు కళ్ళు అప్ప చెప్పి, మరో అరుగు మొదట్లో కూలబడ్డాడు కిష్టమూర్తి.

నలుగురూ ఒకళ్ళ మొహాలు వకళ్ళు చూసుకుంటూ ఎవరు మొదలు పెట్టాలో తెలవక అంతా వక్కసారే తమ రచనలు అని గట్టిగా అనేసి, కంఠాలు సవరించుకొనేందుకు శబ్దాలు చేస్తున్నారు.

హమ్మయ్య, ఆఫీసర్ పంపలేదు అన్న సత్యం తెలుసుకుని, కిష్టమూర్తి స్థిమితంగా రచయితలా వెనక్కి జరిగి గోడకి వెన్నువాల్చి, వాళ్ళల్లోని సాహిత్యకాంక్ష ఎంతుందో తేల్చుకోవచ్చు అన్నట్టు వాళ్ళ కేసి చూస్తున్నాడు.,

బ్రహ్మాండంగా వుంది సార్ ! ఇంత బాగా వ్రాస్తారని మాకు తెలియదు - మళ్ళీ అంతా ఒక్క కంఠముతోటే అనే సరికి --

ఏది బాగుంది, ఎల్లా నచ్చాయన్న ప్రశ్న, కిష్టమూర్తి మెదడులో అడయారులోని మర్రిచెట్టులా పెరిగిపోయింది. వాళ్ళ విజ్ఞత వినేందుకు ఆలస్యం లేకుండా అన్నీ బాగున్నాయి. మొదట్ది మరీ బాగుంది అని, ఒక వ్యక్తి గత అభిప్రాయం వో కంఠంలోంచి బైటపడింది.

అదేమన్నమాట ! నాకు చివర్ది మరీ నచ్చింది___ , చెప్పొద్దూ! అన్న వాదన వెనక నుంచి బయల్దేరింది.

ఏమోసుమా! నాకు మధ్యభాగం అమోఘంగా వుంది. అని మూడోకంఠం శృతికల్పింది.

కిష్టమూర్తి, వాళ్ళకి ఏది బాగుందో తెల్సుకోలేక వో గంట ప్రశ్నలతో విసిగించి, ఆఫీసుగుమాస్తాల చిత్తం, సమాధానంలా విసిగిపోయి మీ మొహం మీకు అర్థం అయివుండదని తేల్చేసి, కసిగా ఇంక వెళ్ళిరండి అని సాగనంపి, తన కవిత్వంలోతులని తలుచుకుంటూ కంచంముందుకు చేరాడు.

ఇంత పొద్దోయేదాక ఏమి మాటలురా అబ్బీ, అన్న తల్లి కంఠము మోతకి వూహల్లోంచి దిగింది కిష్టమూర్తి మనస్సు.

అబ్బీ! మీ మామగారు ఉత్తరం వ్రాశాట్టరా, ఆనవాయితి తీర్చుకు పిల్లని తీసుకెళ్ళమని. మీ అన్నకేమో శలవదొరకదంటూండే ___ ఎప్పుడు వీలు చూసుకు వో ముక్క రాసి పడెయ్యమను అన్న, తల్లి హెచ్చరికతో భోజనం పూర్తి అయినట్లు తెల్చుకుని, వూహల్ని పక్కకి తట్టి ఇప్పుడేం తొందరమ్మా, అక్కడే ఉండనీ అంటూ కిష్టమూర్తి కడిగిన చెయ్యి తుడుచుకుంటూ వసారాలోకి వెళ్ళాడు.

జామి చెట్టుమీద చిలకలు చేసే గోలకి విసుగొచ్చి అదిలించి, కొత్తవూహలకి పునాదులు కడుతూ మంచముచివర, కునుకుతూ తెల్లవార్చాడు.

ఆ రోజు ఆఫీసులో కిష్టమూర్తిపేరు చాలామంది నోట్లో తిరిగింది. అన్నింటికంటే ఆఫీసరే పిల్చి కాఫీ ఇవ్వటం, కిరీటం పెట్టి సన్మానించినంత సంతోషంగా వుంది.

ఆ సంతోషంతో ఇంటికి బయల్దేరిన కిష్టమూర్తికి, మధ్యలో మూర్తి తారసపడ్డాడు.

కుశలప్రశ్నలు, చచ్చువి అడిగి అడిగి చివరికి ఏం వ్రాతలురా, అవి నాకేం అర్థంకాలే. వో ఛందస్సా, పాడా, ఏం భావమో నాకేం అంతుపట్టలేదు. చెప్పొద్దూ - అంటూ

మూతి విరిచాడు.

నీళ్ళల్లో మునిగినవాడిలా అంతేనా! అంతేనా! అంటూ మాటల తడుముకుంటూ, మూర్తిని మనస్సులోనే తిట్టుకున్నాడు కిష్టమూర్తి.

మూర్తి మాటలు సర్దుకొని ఇది నా వూహేననుకో, మా స్నేహితుడు బ్రహ్మాండంగా పొగాడేశాడు, ఈ మధ్యలోఅల్లాంటి కవిత్వం చదవలేదంటూ, ఏమైనా కొత్త దారిలో అడుగు పెట్టావు. ఎక్కడ తేలతావో చూడాలి అంటూ సినిమాకి రమ్మని లాక్కుపోయాడు కిష్టమూర్తిని.

సినిమా చూస్తున్నా, మనస్సు ఆరోజు ఉదయం నుంచీ కలసిన మనస్సుల భావాల్లోని రాగద్వేషాలే తిరుగుతున్నాయి కిష్టమూర్తిలో.

విశ్రాంతి, లైట్లు వెలిగాయి. మాటలు, కేకలు, గోల గందరగోళంలా వుంది. మూర్తి సోడావంకని బయటకి తీసుకుపోయాడు. ఎవరో నవదంపతులు మూర్తికి నమస్కారాలు పెట్టడం చూసి వాళ్ళతో కలిసిపోయాడు. కిష్టమూర్తి ఏం చెయ్యాలో తోచక కిళ్ళీకొట్టుకేసి నడిచాడు.

మూర్తి హడావిడిగా వచ్చి, నిన్ను పరిచయం చెయ్యాలని చూస్తే నువ్వు చెప్పా చెయ్యకుండా ఇటు వుడాయించావా? అంటూ కిష్టమూర్తి చెయ్యిపట్టుకు వెనక్కి తీసుకుపోయాడు. హాల్లో లైట్లు ఆర్పడం చూసి, సీట్లల్లో సర్దుకోవడం మొదలుపెట్టారు.

వీడేనమ్మా మా కిష్టిగాడు. నువ్వేమో మహాకవికింద వర్ణిస్తున్నావు, అంటూ అమ్మాయికి పరిచయం చేశాడు మూర్తి.

అమ్మాయి పళ్ళు నక్షత్రాల్లా మెరుస్తున్నాయి దీపం వెల్తురుపడి. కళ్ళు పెద్దవి కాకపోయినా కాటుక తీరుతో సోగల్లా కనపడ్డాయి. కొనతేరిన ముక్కు అదోలావుంది. నైలాన్ చీర వెనక అస్థిపంజరంలా శరీరం నీరసంగా కనబడింది.

నమస్కారమండీ. మీ రచనల్లో వర్ణన భలేగా ఉంటుందిలెండి. అమ్మాయి మూతిని ఎంతబాగా పోల్చారో, సున్నాలా చుట్టిందని కాదు వ్రాశారు - అంటూ తన మూతిని గుండ్రంగా తిప్పుకుంది.

మూర్తితో అమ్మాయి తాలూకు మనిషి మాట్లాడుతున్నాడు. అతని తీరో ఏమోకాని, చొక్కా, కాలరు చివర్లు చేతులతో పట్టుకొని, కత్తుల్లాంటి చూపులు కనుకొలకుల్లోంచి చూస్తున్నాడు.

ఆట మొదలెట్టారు పదండి అంటూ మూర్తిముందు హాల్లోకి నడిచాడు.

అమ్మాయి జాలిగా చూట్టం చూసి కిష్టమూర్తికి ఆమె తాలూకు మనిషిమీద కోపం వచ్చింది.

అసలు దేవుడిమీదే కోపం వచ్చింది. లేకపోతే అమ్మాయికి అబ్బాయి ఎక్కడైనా ఈడుగా వున్నాడా? పెద్ద బకాసురుడి పొట్టా వాడు. ఆకళ్ళు చూస్తేనే చాలు. ఎంత ఎరుపు! హయ్య బాబోయి! అంత పెద్ద కళ్ళు ఎవరికీ వద్దు అన్నట్లు వున్నాయి. ఆ రంగుకి సాయం ఆ నల్ల పేంటు వొకటి. వెధవ టెర్లిన్ వచ్చి ప్రతీ వాడికీ రంగుల మోజు నేర్పింది. కిష్టమూర్తి వూహలు ఇంక పైకి వెళ్ళకుండా మూర్తి వచ్చి ఇంకా రావేంరా చాలా భాగం అయ్యేపోయింది అంటూ తీసుకుపోయాడు.

ఈసారి కిష్టమూర్తి సినిమాని చూస్తున్నాడు. మాటలు, పాటలు ఆపి, హీరోచేత చాలా లావుపాటి వాడిని చిత్తుగా తన్నిస్తున్నాడు డైరెక్టర్. బలే, బలే అని ముందుగా వున్న ఆడియన్సు వుత్సాహపడుతున్నారు. ఈసారి ఈసన్నటి హీరో ఇద్దరి ముగ్గుర్ని చిత్తుచేసి దూరంగా విసిరేసి చేతులు దులుపుకున్నాడు.

అంతదాకా దాక్కున్న పెద్దలంతావక్కసారివగరుస్తూ వచ్చిపడి, ఆపార్థాలు ఆడియన్సుకి వదిలేసి శ్రీరస్తు, శుభమస్తు అంటూ నిష్క్రమించారు.

చివరి సీను చాలా బాగుందిరా! అంటూ మూర్తి సంతోషపడిపోయి, ఇంటిముఖము పట్టాడు. కిష్టమూర్తి అమ్మాయి పేరు అడగనందుకు నొచ్చుకున్నాడు. ఈసారి కథా వస్తువులో అమ్మాయిని చూపెట్టాలి. ఆలోచనలు గాలిలో చుట్టుకొంటున్నాయి. రిక్షావాడు ఏ సందు అండీ, అన్నాక ఇంటిసందు దాటినట్టు గుర్తు వచ్చింది.

ఆ రాత్రి పక్క అరుగుమీద వేసుకున్నాడు. తన గదిలో వదిన నిద్రపోతోంది. ఐనా ఆవిడకి అంత నిద్రేమిటోఅన్నయ్య వచ్చేదాకా తనకి వీధి అరుగు తప్పదు అనుకుంటూ నడుము వాల్చాడు.

మామగారి ఉత్తరం గుర్తుకి వచ్చి లేచి కూర్చున్నాడు. పెళ్ళయి చాలా ఏళ్ళైంది. తండ్రి పట్టువల్ల చిన్నప్పుడే అమ్మవప్పుకుందట. అమ్మాయి ఎందుకో పెళ్ళిలో ఏడవటం గుర్తువచ్చింది. ఆ కళ్ళు ఎర్రగా వుండటం గుర్తుకు వచ్చి ఇప్పుడే రూపంలోవుందో, తనకి వద్దంటే అన్నయ్య వూరుకోడే. వచ్చింది అక్కడ ఖర్మ. ఐనా ఈ ఉమ్మడి కొంపల్లో ఇల్లాంటి చిక్కులు తప్పవు. అన్నయ్యమాత్రం ఏం తక్కువ తిన్నాడేమిటి? వదిన నలుపనేగా రోజూ ఆ ధూమ్‌ధామ్‌లు. మళ్ళీ ఆ నాంచారి ఎదురుపడితే అంత సంతోషం ఎట్లా వస్తుందో మొహంలోకి. తను పువ్వులపొట్లం ఇస్తోంటే చూశాడనేగా పాలేరాడిని చితక్కొట్టి కొరతవేస్తా! చిత్రం - అమ్మ అన్నయ్యని ఏమీ అనదు. సరికదా, వదిన్నే సాధిస్తుంది. పాపం ఆవిడమాత్రం ఏమి మాట్లాడదు. అన్నయ్య అన్నట్లు వదినకి నిజంగా చెముడు వుందేమో.

ఆలోచనలు ఎక్కడో నిల్చాయి. నిద్దర్లో జరిగాడు కిష్టమూర్తి.

ఓ రోజు పొద్దుటే మామగారు సుపుత్రికను తీసుకు దిగడ్డాడు. ఎన్నాళ్ళకీ జవాబు రాకపోవడమేకాకుండా వాళ్ళు యాత్రకి బయలుదేరుతున్నారట.

కొడుకూ కోడలిదగ్గరా పిల్లని అట్టే పెట్టడానికి మనస్సు వప్పలేదట. ఏమైతే ఏం రామడోళ్ళల్లాంటి పెట్టెలు, పరుపులు గంగాళాలతోటి పిల్లని దిగవిడచి, తిరుగుముఖం పట్టాడు పెద్దమనిషి మామగారు.

సారెసామాన్లు బాగానచ్చి, అబ్బీ ఎంత సారెపెట్టారో చూడరా అంటూ గిన్నెలూ, చెంబులూ, తిప్పి చూసుకుంటూ మురుస్తోంది ముసలావిడ.

ముందు రెండు రోజులు అమ్మాయి కనపడుతుందేమోనని తప్పించుకు తిరిగాడు. అమ్మాయి పేరు కమల. అంతా నోరు మూసుకోకుండా పిలవటం వింటూంటే కిష్టమూర్తికి చిరాకెక్కువైంది.

తల్లితో చెప్పే ధైర్యం తగ్గి వదినగారికి గట్టిగా చెప్పదల్చుకుని పెరట్లోకి వెళ్ళాడు. జామి చెట్టును పట్టుకు మయ్యారంగా వేల్లాడే ఎర్రటి నాజూకైన పిట్ట తేటగా మెరిసే కళ్ళూ, నవ్వుని అందంగా బిగించిన నోరు, కొనతేరిన ముక్కూ, విల్లువొంపుల్లాంటి కనుబొమల మధ్య ఎఱ్ఱటి కుంకం దోసగింజలా పైకి వెళ్ళింది.

వోణీ, కొంగుతో కలిపి జడని బొడ్డులో దోపింది. తెల్లటి పొట్టపై నల్లటిజడ తమాషాగా మెరుస్తోంది.

వదిన కళ్ళు పెద్దవి చేసి నోరు నొక్కుకుంటూ వంటగదిలోకి వెళ్ళిపోయింది.

అబ్బీ అదేమిటిరా? ముసలావిడ కమల తన వళ్ళో పెట్టుకు హవ్వ! అంటూ నోటి మీద మెల్లిగా కొట్టుకుంది ముసలావిడ.

పౌరోహితుడుకి బ్రహ్మాండంగా కబురెట్టి ఖంగారు పెట్టేసి, చుట్టంవల్ల పెద్ద

దోషంలేదని తేల్పించారు.

కమల వచ్చిన వేళ మంచిదిరా పెద్దాడా, అంటూ రోజా ఒక్కొక్క శుభం లెక్కపెట్టి చెపుతోంది తల్లి. మొదటి ఆవుకి ఈ సారి దూడ బతకటం, మెరకపొలంలో ఆ ఏడు వర్షాలు బాగా పడటం, పెద్దాడికి రామయ్య మిల్లులో బేడవాటా ఇవ్వటం, కిష్టిగాడికి వో మెట్టుపైకి వుద్యోగం జరగటం, ఇంకేమి కావాలి నిదర్శనం అంటూ వాదిస్తుంది. తోచినప్పుడు ముసలావిడ.

కమలకి ఇంకా చిన్నతనపు చేష్టలు వదల్లేదు. గట్టిగా నవ్వటం, పిల్లకోతిలా వెక్కిరించడం, అన్నదాన్ని కాదని వాదించటం, చిన్నదానికి పెద్దదానికి పెద్దగా అలిగి తిండిమానటం చూస్తే కిష్టమూర్తికి వళ్ళుమండేది. దానికి తోడు ఈ ముసలావిడ గారం వోటి. చస్తున్నాను అంటూ వదిన గారితో ఏకరుపెట్టి మళ్ళీ మర్చిపోయేవాడు.

కమల్లో తనకి కావల్సిన మంచిగుణాలు మళ్ళీ బోలెడు కనిపించేవి. తన వ్రాతల జోలికి రాదు. పొరపాటున కూడా చదువదు. అసలు చదవటం వచ్చో రాదో కూడా తనకి తెల్సుకొనే అవకాశమే ఇవ్వదు. ఏదైనా కొత్త విషయాలు చెప్పాలన్నా ఆవలించి హంగామా చేసి దీపాలు ఆర్పి భీభత్సం చేస్తుంది.

తనకి విసుగు వస్తుంది. పోనీ బైటకి పోతానంటూ పక్క సరంజామా తీసుకోపోబోతుంది.

నాలుగు అంటించాలన్నంత కోపం వస్తుంది. కాని పక్కగదిలోతల్లి దగ్గు వినబడుతుంది. ఎందుకొచ్చినరభస అర్ధరాత్రి అని తనే సర్దుకు ఓడిపోయి కమలని అడ్డగించి బతిమాలి గది తలుపులు గట్టిగా బిగిస్తాడు.

కాలం స్తిమితంగా వడిలేని నదిలా కదుల్తోంది. ఇప్పుడు పత్రికలు కిష్టమూర్తిని వెతుక్కుంటూ వస్తున్నాయి. అడిగిన ఖాటికితప్ప వ్రాయటం లేదు. అసలు ఖాళీయే దొరకటం లేదు. పొద్దుగుంకి ఇంటికి వెడితే కమల కళ్ళలో కోపం వెలిగి, కాటుకలా చీకటైపోతుంది. ఆచీకట్లో తను మనలేడు. నీరెండ పెరటిగోడ దిగకముందే ఇంటికి రావటం అలవాటైంది. ఎన్నోసార్లు నీరెండ జరక్కుండా తన్నిచూసి నవ్వినట్టు వెలిగేది.

ఆ రోజు కాలేజి పిల్లల్ని విడిపించుకోవటం తనకి సాధ్యపడలేదు. ఎన్నో ప్రశ్నలు తన రహస్యాన్ని ఎన్నో సంగ్రహించి అసంతృప్తిగా నిట్టూర్చారు.

మీరు సామాన్యంగా అందరిలాగే జీవిస్తున్నామని చెప్పినా మేము నమ్మం. ఏదో అసాధారణ సంఘర్షణ మీ జీవితంలో జరిగుండాలి. లేకపోతే అబ్బ ఆ విరహం వ్రాశేరే! అల్లా మామూలు వాళ్ళు వ్రాయలేరు లెండి. చాలామంది అల్లాగే అంటున్నారు.

కిష్టమూర్తిలో వోర్పుతగ్గింది. నమ్మకపోతే మీ ఖర్మ అన్నట్టు మరి వస్తానని వాళ్ళ సమాధానం వినకుండానే బజార్లోకి వచ్చేశాడు. మామూలు అలవాటు మర్చిపోకుండా మిఠాయి కొట్టుదగ్గరకి వెళ్ళి తీసుకున్నాడు. పువ్వుల దుకాణం గున్నమ్మ కునుకుతోంది. ఇంత పొద్దుపోయి వచ్చారేమి అయ్యా! ఐపోయినయ్యి, అంటూ చిటికెలతో ఆవలింతని సాగనంపింది.

ఈ రోజు కమలకి ఏమి చెప్పినా లాభం లేదు. ఏదో మొండి మాటలు అంటుంది. తనకి కోపం వస్తుంది. ఆలోచన పూర్తికాకుండానే వీధి వాకిలి కనడింది. హాల్లోదీపం వెలుగుతోంది. ఎవరి కంఠాలు వినబడటం లేదు. వసారాలోకి తొంగి చేశాడు.

వదిన దిగులుగా గడప్పట్టుకు నిల్చుంది, కూర్చింది. ఏం జరిగిందో అర్థంకాక కిష్టమూర్తి కాళ్ళు వణికాయి. వదిన పక్కకి వచ్చి ఏమిటి అన్నట్లు చూశాడు. ఆవిడ ముసలావిడ కేసి చూసింది. ముసలావిడ కమలకేసి చూసి నిద్దరట్టిందల్లే వుంది - అంటూ మెల్లిగా

తలగడమీదకి జరిపి వసారాలోకి కొంగు సవరించుకుంటూ వచ్చింది.

వీడి పుట్టుకలకి ఇదే వరుస. నాక్కూడా వీధి మొ హం ఏమిటో ఎరగననుకో అంటూ తన గతంలోని ముచ్చట్లు పెద్ద కోడలికి చెప్పుకుంటోంది ముసలావిడ.

అసలు ఏం జరిగిందంటూ కిష్టమూర్తి విసుక్కున్నాడు.

వదినగారు ఏదో ప్రళయ కాలం సమీపించి, క్షణాలు ఆఖరయ్యేటప్పుడు భీతాంగం చుట్టుకున్న మనుష్యుల బాధ అంతా ఆవిడ మొహంలో బిగించి, అతి విచారంగా ప్రొద్దుట నువ్వెళ్లిన దగ్గర నుండీ వకటే డోకులు. ఇన్ని నీళ్ళు కూడా ఇమళ్ళేదు. కాళ్ళు చేతులు తొక్కల్లా వున్నాయి. అస్తమానం డొప్పలా చుట్టుకుంటూంటే ఆ కొత్త నర్సుకి కబురెట్టి మీ అమ్మ కనుక్కుంది - అంటూ మిగిలినది ఆవిడని అడుగు అన్నట్లు దిగులుగా ముసలావిడకేసి చూసింది.

అసలు ఏం చెప్పిందో చెప్పక ఈ సోది అంతా ఎందుకు అని విసుక్కుని, ఏమంది ఏమిటి అని తల్లిని అడిగాడు కిష్టమూర్తి.

వదినగారు కొంగుతో కళ్లు వొత్తుకుంటూ చీకటి గదిలోకి తప్పుకుంది.

ఏం జరిగిందో అర్థంకాక భయంగా తల్లి ఎదుటకి జరిగి నిల్చున్నాడు.

మరేం లేదురా అబ్బీ, రెండోమాసంకూడా మరో వారంలో పూర్తవుతుందట. దాని గుణం అది చూపెట్టక మానుతుందా? నాకంటే నయమేలే, నాకు నెల వెళ్ళటమేమిటి మంచము పట్టడమేమిటి - అంటూ తన పురాణపు పుటలు వెతుక్కుంటోంది ముసలావిడ.

కిష్టమూర్తి సంతోషం వచ్చినట్టువచ్చి మాయమైంది. కమలని నెలల తరబడి మంచంలో చూడాలా! అదేం వుండదేమోలే అనుకుంటూ షర్టుబొత్తాముని గుండ్రంగా తిప్పుకుంటూ సంతోషాన్ని మింగే విచారాన్ని మరిపిస్తూ కమల మంచందగ్గరకి వచ్చాడు. అలసినట్టు నిద్దరోతోంది. బట్టలు మార్చుకుని వరండాలో తిరుగుచున్న వదినగార్ని చూసి గట్టిగా నవ్వాడు కిష్టమూర్తి.

అబ్బీ ఏమిటిరా అంటూ ముసలావిడ వచ్చింది. అబ్బే ఇందాక వదిన మొహంలోని విచారం చూసి హడలిపోయాను. ఏదైనా ప్రళయవార్త వినాలేమోనని, కిష్టమూర్తి చెప్పటం పూర్తికాకుండా అన్నగారు వచ్చాడు.

ఏమిటీ! మీ వదిన విషాద వదనమ్మీదేమిటి నీకు కవిత్వం పుడుతోంటా - అంటూ చాలా హుషారుగా. ఐతే, అబ్బీ వో శుభవార్తరా. రామయ్యగారు నన్ను ఇక్కడ నించి మకామ్ మార్చమంటున్నారు. హైదరాబాద్‌లో పెట్టే కొత్త బ్రాంచిని నన్ను చూసుకోమని పట్టుబడితే సరే అన్నా. మెల్లిగా నువ్వూ అక్కడికే ప్రయత్నించుకుంటే సరి పోతుంది అని తల్లితో కూడా చెప్పాడు.

కిష్టమూర్తికి మొదట చాలా భయమేసింది. ఇంత కాలం ఇంటి భాద్యత అంతా అన్నగారే చూసుకుంటున్నాడు. తను తెచ్చింది ఇస్తే పుచ్చుకుంటాడు, లేకపోతే తనే సర్దుకుని గడిపే అన్నలేకుండా ముందు వుండగలగాలి.

ఏమంటావురా! అన్న ప్రశ్నకి, నువ్వు లేకుండా ఎల్లా ఉండటమో భయంగా వుంది - అన్న కిష్టమూర్తి కంఠస్వరంలోని విచారం అన్నగారి మనస్సుని కదిపింది. ఓసారి చూసి వస్తా, నచ్చకపోతే వాళ్ళ ఇష్టం వచ్చినవాళ్ళకి ఇచ్చుకోమని వచ్చేస్తానంటూ ఏమి ఏమి పనులు వున్నాయో కిష్టమూర్తికి అప్పజెప్పి తెల్లవారుఝామున ప్రయాణం పెట్టుకున్నాడు.

ఇంటికి పెద్ద కిష్టమూర్తి అవటంతో ఇంటివాళ్ళ కోరికలు రెండింతలై ప్రాణాల్ని విసిగిస్తున్నారు.

పొద్దుగూకి వస్తే తల్లి పటికబెల్లం తెమ్మంటుంది. పొద్దు వుండగావస్తే కమల సినిమాకి బయలుదేరుతుంది.

వెళ్ళేటప్పుడు వదినగారు దిగులుగా మీ అన్నయ్య అఫీసు కెళ్ళి కనుక్కున్నావా! అంటుంది.

ఆఫీసులో మరో ఇద్దరి చాకిరీ అతికించారు ఇన్నింటినీ భరించి వూపిరి తీసుకునేవేళకి "కొత్త పత్రికకి ఒకటి వ్రాయమని పారితోషకం పంపగలమని" బెదిరింపు.

కిష్టమూర్తికి ఎందుకో విసుగ్గా వుంది. సెలవు తీసుకు ఎక్కడికైనా వెళ్ళాలన్న కోరిక ఎక్కువైంది. కమలతో అనటమే తడవుగా పుట్టింటికి ప్రయాణం కట్టింది. కిష్టమూర్తి సెలవు పెట్టే ఉద్దేశ్యం మానుకున్నాడు. కమల కోపంతో పట్టుబట్టి పుట్టింటికి వెళ్ళి పోయింది.

ఇప్పుడు అసలు తోచటం లేదు. ఏ విసిగించినా కమల వుంటేనే బాగున్నట్లు తెల్సుకున్నాడు కిష్టమూర్తి. ఏమైనా శలవు తీసుకువెళ్ళి కమల్ని తీసుకు రావాలి. అదే ఆలోచనతో ఆఫీసు వెళ్ళి మెట్టు ఎక్కాడు. ఆరోజు టపా చాలామందికి మంచి వార్తలు తెచ్చింది. అందులో కిష్టమూర్తి ఒకడు. మీ అన్న ప్రయత్నించాడా? అని, నీకు ప్రమోషన్ వస్తుందని అనుకోలేదుసుమా! అంటూ చాలామంది బయట పడ్డారు.

ఇంటిదగ్గర సంతోషం పంచుకునేందుకు కమల లేకపోవటం బాగాలేదు అనిపించింది. ఆ రాత్రి అన్నగారు రావటం వొరకంగా మనస్సుకి హాయిగా వుంది. ఎంతోసేపు ఎన్నో మాటలు చెప్పుకున్నారు. అన్నగారు మరో రెండు నెలలతర్వాత గాని హైదరాబాద్‌కు రాననటం కిష్టమూరికి నచ్చలేదు. ఏమనలేక వూరుకున్నాడు.

కమలని తీసుకువస్తానన్న మాటకి తల్లి అడ్డుపడింది. అదేమన్నమాట ఏడోమాసం కూడా పూర్తవ్వవచ్చింది. వాళ్ళు పంపరు, మనం అడక్కూడదు. కాని ఆ మూడుచెంబుల నీళ్ళుపోసుకున్నాక తెచ్చుకోవచ్చు అంటూ గుక్కతిప్పుకుంది.

ఆఖరికి వదినగార్ని తీసుకెళ్ళి హైదరాబాద్ కాపురం మొదలుట్టాల్సి వచ్చింది కిష్టమూర్తికి. అన్నగారు అన్నీ సవరించి వెళ్ళిపోయాడు.

అసలు ఆ ప్రదేశం అంతా కొత్తగా వుంది. మొదట ఆ యిల్లు యిల్లులాలేదు. మేడమీద కాపురం, ఎటునుంచి చూసినా మరో యింట్లోని సినిమాలా చూడవచ్చు. ఇల్లు విశాలంగానే వుంది. ఐనా కిష్టమూర్తికి నచ్చింది ముందు వరండా ఒక్కటే. దూరంగా రోడ్డవతల నేరేడు చెట్టు, దానికి అవతల శరీరాల్ని దాచుకున్న గోరీలు, గోరీల మధ్య చిన్న చిన్న బోడి చెట్లు - హోరుమని ఏడుస్తున్నట్టు అప్పుడప్పుడు ఈదరగాలి, మసక వెన్నెట్లో గోరీల్లోని జీవాలు కదిలితే కీచుదురాళ్ళు పహారా ఇవ్వటం - ఆకాశపుటంచులో దాగి నక్షత్రాలు రెప్పలార్పుతూ చూడతోచేది కిష్టమూర్తికి.

వదినగారి అవస్త చూస్తే మరీ జాలేసింది. పనిమనిషి రావటమే పొద్దెక్కుతుంది. వచ్చినా కిందవాటావాళ్ళు పిలిస్తే పరుగెడుతుంది. మళ్ళీ పిల్చేందుకు వదినకు భయం. మరో మనిషిని రానివ్వరుట. ఈ సమస్య తీరటం కష్టంగానే తోచింది.

కూరగాయలకని గేటులోకి వచ్చిన కిష్టమూర్తి రిక్షాలోంచి దిగిన ఆకారాలు ఎదురైనాయి. ఎక్కడో చూసిన గుర్తు వచ్చింది. వెంటనే గుర్తుపట్టలేక పోయాడు. సామానులతో రిక్షా పక్కింటి గేటులోకి తిరిగింది.

ఏవో కూరలు, ఏదో తూకం పూర్తి చేసుకు వచ్చాడు. వదిన కళ్ళు వాచేలా ఏడుస్తోంది. ఎందుకో అర్థం కాక కిష్టమూర్తి తికమక పడ్డాడు. ఇంటావిడ కోప్పడిందట, నీళ్ళు కిందికి పడ్డాయిని. పోనీ నువ్వు ఇంటి కెళ్ళిపోరాదు, నేను ఏ హోటల్లోనో తింటాను అని

కిష్టమూర్తి ప్రాధేయపడ్డా వెళ్ళనని అడ్డంగా తలవూపింది.

పగలు టైమ్ తిరిగిపోతోంది. రాత్రి గడవటం కష్టంగా వుంది. అంతింట్లో వదిన వక్కర్తీ బిక్కు బిక్కు మంటూ తిరుగుతోంది. కిష్టమూర్తికి చాలా రాత్రి దాకా వరండాలోనే గడిచిపోతోంది.

మళ్ళీ వ్రాయటం మొదలెట్టాడు. నక్షత్రాల్లో నాయకుల్ని తిప్పుతున్నాడు. మసీదుల్లో, ఊర్వసికి బస, రాజ్యాల్లేని రాజు పురూరవుడు. ఊర్వసికోసం ఎలక్షన్స్‌లో వోడినట్లు రాస్తే, అన్న వూహకి నవ్వుకున్నాడు.

అబ్బీ చాలా పొద్దుపోయింది అన్న వదినగారి కంఠం కీచురాయిలా మోగింది.

నువ్వుపడుకో, మని మళ్ళీ వూహలోకి వెళ్ళిపోయాడు కిష్టమూర్తి, ఎప్పుడో పడక్కుర్చీలో కన్నుమూశాడు. వీధివరండాలోకి ఎండ బాగా ప్రొద్దెక్కితేకాని రాదు. బద్ధకంగా వుండి కళ్ళు తెరవబుద్ధికాలేదు.

పనిమనిషి మాటలు అర్థంకాక వూకొడుతోంది వదినగారు. ఎప్పటికి ఆడనే కూర్చుంటారా? ఎవరు మీదొర? అంటే అని వదిన అడిగితే పనిమనిషి పళ్ళికిలిస్తోంది.

కిష్టమూర్తిలేచివెళ్ళి ఇల్లంతా తిరిగినా బద్ధకం పోలేదు. మకిలిగావున్న అద్దం అలమర తలుపుతో వూగుతోంది. మాసి పోయిన అద్దంలో మొహంలో లోతులు కనిపించాయి. కళ్ళు గుంటపడ్డాయి. పనిమనిషి అదోలా చూస్తోంది.

పాలవాడి కేకతో వదిన వరండాలోకి వెళ్ళింది. ఏమి వూరో, ఓ వేళా పాళా లేదు. ఇంత పొద్దుఎక్కి పాలువస్తే ఐనట్టే. అన్నగారు ఎల్లావున్నాడో మరి. అనుకుంటుండగానే, అన్నగారి కంఠం వినపడింది. వచ్చిన పని విశేషాలు చెప్పటంలో, కమలకి కొడుకు పుట్టినట్టు సామాన్యంగా చెప్పాడు అన్నగారు. కిష్టమూర్తికి ఏదో తమాషాగా అనిపించిది. మళ్ళా ఎల్లావుంటాడు? అన్న వూహలో తేలిపోతూండగా వదినగారు టైమ్ గుర్తుచేసింది. వదినలోని గొప్ప సుగుణం, ఎవరికైనాసరే టైమ్ సరిగ్గా చెప్పి తనకర్తవ్యం తీరినందుకు తృప్తిగా మొహం తుడుచుకుంటుంది కొంగుతో.

కిష్టమూర్తికిఆఫీసునుంచి తిరిగి వచ్చేసరికే అన్నగారు వెళ్ళిపోయాడుట. ఏం సుఖమో ప్రయాణాలు అంత సులువుగా చేస్తాడు అని విసుకున్నాడు.

కమలకి పెద్ద వుత్తరం వ్రాసి మూడు రోజులైంది. సమాధానం కోసం ఎదురు చూస్తున్నాడు. ఆ రోజుకూడా రాలేదు. విసుక్కున్నాడు. మర్నాడు ఆఫీసుకి సెలవు. ఏం పొద్దుపోదు.

రాత్రి వ్రాసేందుకు కూర్చున్నాడు. వ్రాయబుద్ధి పుట్టలేదు. అటూ ఇటూ తిరుగుతూ యింటి చుట్టుపక్కలకి చూశాడు. పక్కింటి కిటికీలో అమ్మాయి పమిటి సవరించుకుంటోంది. జడ సవరించుకుంది. ఎందుకో చీకట్లో అంత ముస్తాబు - నవ్వు వచ్చింది. దాని ఎదురు కిటికీలో ఆడవాళ్ళ తలలు గుంపుగా తొంగి చూస్తున్నాయి. ఏమిటో ఆ వింత - అర్థంకాక ఆ పక్కకి చూస్తున్నాడు కిష్టమూర్తి.

అమ్మాయి వెనక్కి ఓ పెద్ద ఆకారం వచ్చి సకిలించి దీపం తీశాడు ముందు - తరువాత కిటికీ మూశాడు. మళ్ళీ వెలిగిన దీపం సందుల్లోంచి వెలుతురు చక్కగా బయటపడుతోంది.

ఎదటి కిటికీలో సంచలనం గుసగుసలుగా మారి కిలకిలలోకి మారినట్టు కిష్టమూర్తికి అర్థమైంది. కారణం మాత్రం బోధపడలేదు.

ఏవో ఆలోచనలు వస్తున్నాయి, పోతున్నాయి. కాయితాల బొంతర విడదీసి ఏవో

చుక్కలు పెట్టాడు - గళ్ళు గీశాడు - మద్యలో అక్షరాలు వ్రాశాడు. అన్నీ కలుపుకుని చదివి ఆశ్చర్య పడ్డాడు. ఇదో తమాషా రచనే అనుకుని మరోటి వ్రాయాలన్నకున్నా ముందుదానిలా కుదర్లేదు.

ఐనా, విడవకుండా పూర్తిచూశాడు. పక్కవీధిలో వున్న పేపరుకి ఇవ్వవచ్చు అనుకొన్నాడు.

తెల్లవారినా మబ్బుల్లో సూర్యుడు దోబూచులాడుతున్నాడు. నల్లచీరలో బంగారం జరీముద్దలో అక్కడక్కడ కదుల్తూ విచిత్రంగా తిరుగుతున్నాడు. బట్టలు తడుస్తాయేమో వర్షం వస్తే అని వెళ్ళేందుకు సంశయిస్తూ వాహనాల కోసం ఎదురుచూస్తున్నాడు.

ఎన్నో రకాల పాటలు జాలర్లవి, రొయ్యలవి, బళ్ళ వాళ్ళమీద విన్నట్లు గుర్తు. పాపం, హైదరాబాద్ రిక్షా అని వ్రాయాలనిపించింది. చినుకులు టపటపలాడుతూ వక్క సారి సైన్యంలా నేలపైకి వురికాయి. కుర్చీ వెనక్కి జరుపుక్కూర్చున్నాడు.

పక్కింటి వాటా కిటికీల్లో వక్కజడ, రెండు జడలు అమ్మాయిలు రంగురంగుల బట్టలతో కిటికీలకి అతుక్కున్నారు. వర్షపుధార ఎప్పుడు మొదలైందో ఎన్నోసార్లు చూడాలనుకున్నా మొదటి ధారని చూడ్డం పడనే లేదు - అని దిగులు పడ్డాడు కిష్టమూర్తి.

ఇటుపక్క మేడమీద అమ్మాయి బెదురుతూ చూస్తోంది. ఎదరింటి కిటికీలో ఖరీదైన చీరలా కనబడుతోంది.

దూరంగా గోరీలు చలికి గోషపెట్టినట్టు వర్షం అక్కడ ఎక్కువగా నిల్చి సాలివాడి మగ్గంలో కదురులా కదులుతోంది.

ఎవరో తలుపు కొట్టారు. ఎవరు కావాలి అన్నాడు. కిష్టమూర్తిగారు వుండేది యిక్కడేనా! - అవును అన్నట్టు తల వూపాడు. రచనలు చేస్తారే ఆయన. ఆసారి బిగ్గరగా నవ్వుతూ అమ్మాయి కళ్ళలోకి చూశాడు. పమిట సవరించుకుంది. పక్కింటి కిటికీలోకి చూసింది. కొంగు ముందుకు లాగిపట్టింది పక్కని వున్నావిడ చీరకేసి చూసింది. చేతి గాజులు తడుముకుంది. ఐనా మాటలు పైకి రావటం లేదు. మేము ఈ ఇంట్లోనే కింద వుంటున్నాము. మీ రచనలంటే మహాయిష్టం, అంటూ గుక్క తిప్పుకోకుండా చెప్పేసింది. అక్కడ వున్న రెండు కుర్చీలు చూపెట్టాడు కూర్చోమని. రెండో ఆవిడ మొదటి నుంచీ కిష్టమూర్తి చూట్టంతప్ప మాట్లాళ్ళేదు. ఏమనుకుందో - గుర్తున్నానా? అని మెదలెట్టింది. మూర్తితో సినిమాలో చూడటం గుర్తు చేసింది.

హయ్యబాబోయ్! ఇంత మారుఫాతగిలా సన్నగా వున్న శరీరం చిన్నమానులా తేరింది. నక్షత్రాల్లా మెరిసే పళ్ళు ఎర్రగా కిళ్ళీమరకలని కప్పుకున్నాయి. ఏడాది తిరక్కుండా మనుషులు మారతారన్న సత్యం బోధించుకున్నాడు బుర్రకి. ఐనా నమ్మలేకపోతోంది మనస్సు. ఏదో మాట్లాడాలి - మీ వారు బాగున్నారా . అడిగాడు కిష్టమూర్తి. ఆ నిక్షేపంగా, ఆ రోజు చూసికూడా మాట్లాడలేదని నొచ్చుకున్నారు. వోసారి వచ్చి వారిని కలవ కూడదూ? కవులకు పట్టింపులు వుండవుగా అంది - ఎర్రపళ్ళని కనబడేట్టు నవ్వుతూ.

ఈ అమ్మాయి పేరు అరుణిమ. తను కూడా వ్రాయాలని ఉబలాటపడుతుంది. ఏమిటో సంసారం - అందరూ వకలా వుండరు చూడండి. తాను వ్రాసినవి మీరు చూసిపెడతారేమోనన్న ఆశతో వచ్చింది - అంటూ పెద్ద చిట్టాపుస్తకం వోటి చేతికిచ్చింది రెండో ఆమె.

ఎవరివి వారే తప్పుదిద్దితే బాధపడవచ్చు అని అరుణిమ కేసి చూశాడు. నిజమేనండి - వూరికే మీ చేత చదివించేందుకే తీసుకొస్తా - అంటూ పుస్తకం లాక్కుని వింటారా?

చదువుతాను అని పుస్తకం తెరిచింది. ఆ కవిత్వాన్ని మెచ్చుకున్నవాళ్ళ పేర్లు పెద్దక్షరాల్లో వ్రాసి అట్టలోపల అతికించుకుంది. వర్షం తగ్గేధోరణి కనపడలేదు. పక్కింటి కిటికీలో కళ్ళు గుంపుగా చేరాయి. చూసేందుకు తమాషాగా వుంది. కిష్టమూర్తి అగ్గిపుల్లతో - పళ్ళుకుట్టుకుంటూ అటుకేసి చూస్తున్నాడు.

వాళ్ళని చూడకండి, మిమ్మల్ని గురించి ఎల్లాగో ఏమిటి, ఏమిటి చెప్పుకుంటున్నారు, అని అరుణిమ కళ్ళుతిప్పుతూ చెపుతోంది. వద్దని పక్కావిడ చేత్తోగోకినా వినిపించుకునే స్థితిలో లేదు.

ఏం చెప్పుకుంటున్నారో చెప్పండి అంటూ కిష్టమూర్తి అరుణిమపక్కకి మోడా జరుపుక్కూర్చున్నాడు.

మీరు వ్రాసిన ఊర్వసి సమాధిలో వర్ణనలన్ని ఎదురింటి ఆవిడని చూసి వ్రాసినవట. ఈమధ్య పడిన "ప్రేయసి"లో ఈ పక్కింటి ఆవిడ వుందట. మరేమో నిన్నటి దినపత్రికలో పడిన 'నల్లమేఘము'లో వీరున్నారట అంటూ ఆగి "రాకాసివిధి" అన్న దాంట్లో నన్ను చూపెట్టారని మా వారికి మీమీద కోపం. నేను కానని ఎంతచెప్పినా వినరే. అసలు వీళ్ళకి భావ సౌందర్యం అర్థంకాదు - అంటూ వుద్రేకముతో ఎరుపెక్కిన ఆమె మోహం చూసేందుకు ప్రయత్నిస్తూ లేచి నిల్చుంది రెండో ఆమె.

ఆవిడ చేతినిపట్టుకుని కొంచెము సేపు కూర్చోమని అరుణిమ బతిమలాడింది.

నాకో సందేహం వుంది అడగనా అంటూ అరుణిమ జంకుతున్నట్టు నటిస్తూ అసలు, మీరు వర్ణించే స్త్రీల గురించి మీరు ఏమని వూహిస్తారో వినాలనివుంది అంటూ కిష్టమూర్తికళ్ళలోకి వయ్యారంగా చూసింది.

అంత నగ్నంగా అడిగితే ఎల్లాచచ్చేది అబ్బా! ఇప్పుడు మిమ్మల్ని చూసినట్టే నాపాత్రలని కూడా నిశితంగా చూస్తానేమొ ఏం, అంతేనా; అరుణిమనే అడిగాడు కిష్టమూర్తి.

భలే కొంటెవారే! ఏమో అనుకున్నా అంటూ అవసరంలేక పోయినా పమిట కుచ్చెళ్ళు పల్చగా సర్దుకుంది అరుణిమ.

మరి మీ నాయికలో ఎవరంటే ఎక్కువ ఇష్టమేని తెలుసుకోవచ్చా అని ఈసారి రెండోఆవిడ కులుకుతూ అడిగింది.

ఓ దివ్యంగా, కాని ఆ క్షణాలు ఎప్పుడో వస్తాయి. అంతవరకూ వేచివుండు. శ్రీప్రభంధ నాయకాకీమణీ, సమాసం బాగుందా? అంటూ కిష్టమూర్తినవ్వుకున్నాడు. పనిమనిషి హడావుడిగా వచ్చింది. అయ్యగోరు అగ్గయిపోతున్నారు. తొందరగావెళ్ళండి అన్నమ్మొగోరు అంది భయపడుతూ. అరుణిమ షాక్‌తిన్నట్లు చూసింది.

కిష్టమూర్తితో చెప్పకుండానే వెళ్ళిపోయింది. రెండో ఆవిడకి ఏదో చెప్పాలని వుంది. అమ్మాయి మాటలు అన్నీ నిజంగావులెండి మీరంటే చాలాయిష్టం. పాపం మీ పుస్తకాలని గుండెలపై పెట్టుకు పడుకుందిట. అందరితోటి తన్ని గురించే వ్రాస్తున్నారని చెప్పుకుమురుస్తుంది. అదోపిచ్చి. మరివస్తా, మావారినోసారి పలకరిద్దురూ అంటూ మెట్లుదిగింది. ఈసారి కూడా పేరు తెలుసుకోలేదు అనుకున్నాడు కిష్టమూర్తి.

వర్షంవచ్చినంత తొందరగా నిల్చిపోయింది. దూరంగా నేరేడు చెట్టు స్నానంచేసి జుట్టు ఆరపెట్టుకున్నట్లు గాలికి మెల్లిగా కదులుతోంది. మబ్బులుపల్చబడి ఎక్కడికో వేగంగా కదిలిపోతున్నాయి. సూర్యబింబము నవ్వినట్టు, చల్లటి వాతావరణంలో కాంతులు మెరిశాయి. రోడ్డుపైన సరదాగా బయలు దేరాడు కిష్టమూర్తి. స్నేహితుడితో సాయంత్రం చార్‌మినార్‌కి వెళ్లాడు. మనుష్యుల గుంపులు, దుకాణాల యిరుకు, గల్లీలు, మందల్లా మనుషులు

కదులుతున్నారు. చార్‌మినార్ స్థంభాల్లా కోరికలు ఎదిగిపోయాయి వారిలో. వో గుంపులో అర్భకుడు అరుస్తున్నాడు. కోటు, గడ్డం, టోపి, ఆకారాన్ని శుభ్రపరచినా నిప్పులాంటి కళ్ళల్లోంచి ఆవేదన బైటపడుతోంది. ఎఱ్ఱటోపీలు దూరదూరంగా గుసగుసలు.

మతం అంటే ఏమిటో బోధిస్తున్నాడుటరా - అంటూ పక్కనించి వో కంఠము వినపడింది.

గుంపులమధ్య గోల బయలుదేరింది. ఎర్రటోపీల ఈలలు ఆ హడావిడికి దూరంగా జరిగి బైటికి వచ్చాక, ఆ ప్రాంతాల శోభని వర్ణిస్తున్నాడు. ఆనాటి శుభ్రత, అద్దాల్లాంటి వీధులు, పరదావెనక స్త్రీలు, ఇంత జనం ఇల్లా విచ్చలవిడిగా వీధులమీదికి ఎగబడ్డమే- అంటూ ఆశ్చర్యాన్ని తెలుపుతూ నాలిక కొరుకున్నాడు.

అతన్ని విడిచి యింటికి చేరేసరికి బాగా చికటిపడింది. వదిన వరండాలో స్థంభాన్ని అనుకుని నిల్చుంది. సగం చీకటిని కప్పుకు అందులో కలిసిపోయింది.

మళ్ళీ వరండాకి చేరేసరికి వీధి సగం మాటుమణిగింది.

పక్కింటి పనివాడు తలుపుకొట్టాడు. ఈ దీపం తీసెయ్యి అని కిష్టమూర్తితో అన్నాడు. అర్థం కాక చూస్తున్నాడు.

మా అయ్యకి నిద్రపట్టంలేదు. ఇప్పుడు అర్థమైంది. కిటికీ మూసుకోమను - అని కోపంగా తలుపువేశాడు కిష్టమూర్తి.

ఆ రాత్రన్నీ పీడకలలే. తెల్లవారుతోంది. ఆకాశంలో ఎరుపు ఇసుక మేడల శిఖరంలా పెరుగుతోంది.

కింద పంపుదగ్గరకంఠాలు పెద్దవయ్యాయి, అదేమి చోద్దెమోనమ్మా ఎప్పుడూ లైటువేసినట్టే వుంటుంది. అన్న మాట ఎవరిదో అనుకున్నాడు. అరుణిమకు కూడా అంతపెద్ద కంఠము వుంది అన్నమాట.

పాపం అయన ఏం చేస్తారు. అందాన్ని వెతుకుతుంది కవి హృదయం. అందులో తప్పు నాకేం కనపడలా. సంఘము ఆయనికి కావల్సింది ఇవ్వలేదు. అన్నీ సమకూరితే కవి హృదయం నిద్దరోతుంది, అంటూ ఆవేదన పడుతోంది అరుణిమ.

మహా మీకే అర్థమైనట్టు చెబుతున్నారే. అందుకని, పరాయి అమ్మాయిల పమిటి వెనక వర్ణనలు చేస్తే వూరుకుంటారేమిటి? ఇదే మీ పల్లెల్లో అవుతే నిలవేసి అడిగేవాళ్ళు. అని మరోకంఠము అబ్బో పల్లెల్లో నీతి చెప్పాలి.

డబ్బు షోకువున్న మొగాడు వీధిలోకి వస్తే విరగపడి చూపులు. మాకేమి తెలవ్వను కోకండి.

అక్కడా వున్నారు, ఇక్కడా వున్నారు. అంత పెద్దమాటలు మనకెందుకులెండి అని మరోతీర్పు.

ఐనా నాకు తెలవకడుగుతా, మీ ఆయనకి ఇష్టం లేనప్పుడు నువ్వెందుకు పైకి వెళ్ళి ఆయనతో మాట్లాడావు. నిలేసింది మరోకంఠము.

మాట్లాడ్డంలో తప్పులేదు, కనక నీ కెందుకు నా విషయాలు అన్నది. అరుణిమ కంఠం వినడిది.

నాకెందుకా? పక్కనివుండి, మీగోల వినలేక చస్తున్నందుకు - రాత్రి అంతా కంటిమీద కునుకులేదు మీ రావణగోలతో తెలిసింది! అంటూ సవాల్‌గా ఆగింది ఆ కంఠం.

నాకు అందరిలా చెత్తకబుర్లంటే గిట్టవు ఏం చెయ్యను. అల్లా పుట్టించాడు నన్ను. వో పెద్ద రచయిత మనమధ్యకే వచ్చి కాపురం చేస్తుంటే నా మనస్సు పరిచయం చేసుకోకుండా

వుండనివ్వలేదు. నేను చెప్పినా మీకు అర్థం కాదు.

అబ్బో మహా పాండిత్యం అంతా నీవక్క దానిదే సొత్తు ఐనట్లు మాట్లాడుతున్నావే; అర్థంకాదుట.

కుమారసంభవంలో, ఏ వర్ణంనైనాసరే అడుగు అప్ప చెబుతాడు. అందుకని ఎవడో ముక్కూమొహం తెలీని వాడి దగ్గర కెళ్ళి మీ రచనలు బాగున్నాయి అని చస్తే అనను అని ఇందాకటి కంఠం ఇంకా గట్టిగా చెప్పింది.

అప్ప చెప్పటంలో ఏవుందిలే, సున్నితమైన సన్నివేశాలు హత్తుకునేలా అర్థం చేసుకోవాలి. నన్నడిగితే వాల్మీకీ అంత గొప్పగా రచనల్లో చిత్రాల్ని చూపుతారు ఈయన; అంటూన్నది అరుణిమ.

ఆ కాలంలో కావ్యాలు వ్రాసేవాళ్ళు తక్కువ, విని ఆదరించేవాళ్లు ఎక్కువ. ఇప్పుడా; అంతా వ్రాసేవాళ్ళే. వినేవాళ్ళని, చదివేవాళ్ళని, వెతుక్కోవాలి. అందుకే కుక్కగొడుగులా, సాహిత్యం నిలవటం లేదు. ఇవాళ విన్న పేరు రేపు వుంటుందో వుండదో. పైగా ఇప్పుడు వ్రాసేవన్నీ సొంతాలేమి కాదు. నాలుగింటిలో భావాలు తీసుకు సొంతము చేసుకోవడమేగా? ఎవరికి వోపిక ఎందులోదో వెతికి పట్టుకునేందుకు. ఐనా పొద్దున్నే ఈ వాదనేమిటి నాకు మతి లేదు అంటూ ఆ కంఠము స్తిమిత పడి చల్లారింది.

కిష్టమూర్తి ఆవిడని చూడాలని వుంది. అరుణిమ పొగిడినా ఎందుకో ప్రత్యేకత కలగలేదు. ఆరెండో ఆవిడను చూడాలి. ఎందుకో చూడకుండానే మంచి తెలివైన ఘటంలా తోస్తోంది. అనుకుంటూ కిష్టమూర్తి నిత్యకృత్యాల్లో కలిసిపోయాడు. ఆఫీసులో కూడా ఆడవాళ్ళు ఇద్దరు చేరారు. కొత్తగా వచ్చినవాళ్ళే. మొదట్లో వున్నభయం ఇద్దరిలోనూ మరుగు పడింది. సమయం, సందర్భం కుదిరినప్పుడల్లా ఎన్నో మాయలు వలకపోస్తారు. కిష్టమూర్తి ఆఫీసు కాయితాల ముందు కూర్చున్న అమ్మాయిలు, అమ్మాయిలుగా తోచరు. అదేం ఖర్మో, ఐనా తన వూహే ఐవుండవచ్చు. వాళ్ళు అందరి దగ్గరా అల్లాగే వుండవచ్చు అని సమాధాన పడ్డాడు.

కిష్టమూర్తికి బస్సు దొరకలేదు, నడుస్తున్నాడు. పక్కన ఎవరో నడుస్తున్నట్టుతోచి తప్పుకొని నడకసాగించాడు. మీరు వుండేది ఎక్కడా, బంగారు కంఠం ఎక్కడో విన్నట్టువుంది. తిరిగి చూశాడు. ఓహో నువ్వా అని నవ్వాడు. ఈ ఇల్లే మేము వుండేది, వస్తారా అని అడిగింది. మరోసారి ఆనాలనుకున్నాడు. రమ్మని మారాం చేసింది. తప్పలేదు.

అంత పెద్ద మేడ వెనుక చిన్న ఇంట్లో చిన్న గదులు రెండు తీసుకుందిట. వుద్యోగం, టైపిస్టు, కాని అలంకరణకి చాలా ఖర్చు పెడుతుంది. పాపం ముసలి తల్లి మాసిన బట్టలతో ఎదురైంది.

తల్లిపైన విసుక్కుంటే పక్కసందులోకి తప్పుకుంది. తనగది చూడమంది. దణ్ణెం నిండా నైలాన్ చీరలు తోరణంలా వున్నాయి. కిటికీలోని పేకెట్టు విప్పింది. అబ్బా ఎంతమంచివాడో ఏదో ఒకటి పంపుతాడు అంటూ స్లీవ్‌లెస్ జాకెట్టు తిప్పి చూసుకు మురిసింది.

మరి నేను వస్తానని కిష్టమూర్తి బైటికి వచ్చాడు. పోనెండి మీలాంటి గొప్పవారికి వుండబుద్ధికాదు మా కొంపఅంటూ మూతి ముడుచుకుంది.

అల్లాగాండీ, అంటూ కిష్టమూర్తి అర్థంలేనినవ్వు నవ్వి గేటు బయటికి చేరాడు.

ఇంటికి వచ్చేసరికి చంటిపిల్ల ఏడుపు వినపడింది. ఎవరు వచ్చారో అర్థంకాక తటపటాయిస్తున్నాడు లోపలికి వెళ్ళేందుకు. కమల రంగుల గుడ్డల్ని కుదుపుకుంటూ

ఎదురైంది. కిష్టమూర్తికి ఆశ్చర్యం, సంతోషం ఏమిటోలా వుంది కళ్లు పెద్దవి చేసి చూసాడు. మీ మామగారు మనింటి దగ్గర దింపి వెళ్ళారుట. మీ అన్నయ్య పిల్చుకొచ్చారు. వదిన చెప్పాల్సింది ఐపోయినట్లు వంటగదిలోకి వెళ్ళింది.

కమల్లో ఏదో మార్పు కనబడింది. బుగ్గలకి బలం పట్టింది. నడుం సన్నబడి పైభాగం బరువెక్కింది. నడుం కింద కూడా బాగా పెరిగినట్టు నడకలో బరువు కనబడుతోంది. చాలా ఏళ్ళు పెరుగిపోయినట్టు తోచింది. చేతుల్లో అడ్డంగా వున్న రంగుల గుడ్డల్లోని జీవం కదిలింది. కళ్ళు మెరిశాయి. అవయవాలు ఆడుతున్నాయి. కిష్టమూర్తిగుండె కొట్టుకుంది. తన రూపం వెతుకున్నట్టు దగ్గరగా మొహంపెట్టి చూస్తున్నాడు. ఏమిటి అన్నట్టు కమల గట్టిగా నవ్వింది. పసివాడు కేవుమని ఏడిచాడు.

కిష్టమూర్తికి కోపం వచ్చింది. కమల నవ్వేమిటి! హాయిగా పుట్టింట్లో రాణీలా పెరిగి వచ్చింది. తను ఎంత చిక్కిపోయానో అనుకుని జాలిపడ్డాడు తనమీద.

కమల చాలా మామూలుగా మాట్లాడేస్తోంది. ఇన్నాళ్ళు ఇక్కడ లేమన్న బెదురు ఎక్కడా కనబడలేదు. పని మనిషిని బెదరగొట్టి చేయించేస్తోంది. పక్కలు పరిపించింది. పిల్లాడికి దిష్టి చుట్టించింది. పాలవాడిని మార్చేసింది. ఇన్ని నెలలుగా తనకీ, వదినకీ వీలుపడని పనులు. సగం రోజుల్లో పూర్తిచేసింది. అసలు కమలకి దిగులు వుండదేమో. వుంటే ఎందుకు రాలేదని వక్క ముక్క అడగదా; ఆఖరికి ఒక్క వుత్తరం కూడా వ్రాయలేదె. తనే వెర్రివాడు, కమలంటే తనకెందుకుండాలి జాలి. వరండాలో కూర్చున్న కిష్టమూర్తికి రకరకాల ఆలోచనలు తిరుగుతున్నాయి.

చంటాడు నిద్రపోతున్నాడు. తోటికోడలికి సాయపడింది. వాకిట్లోకి తొంగిచూసింది. వరండా చివరకి వచ్చి కిందకి తొంగి చూసింది.

పక్కింటి కిటికీ గదిలో దీపాలు వెలిగాయి. చుట్టూ కనపడ్డమటుకు మొహాల్ని పరకాయించి చూస్తోంది కమల.

కిష్టమూర్తి పుస్తకంలోకి దాచుకున్నాడు, కళ్ళని.

ముదురాకు పచ్చ రవిక పొట్టిది తొడిగింది. పసుపు రంగు పల్చటి జరీచీర దీపం కాంతిలో మెరుస్తోంది. నల్లపూసలు పచ్చటి జాకెట్టుమెడని చెట్టుకు మణుల్లా మెరుస్తున్నాయి.

జాకెట్టు పొట్టయిందా అన్న తోటికోడలి మాటకి వెనక్కితిరిగింది. అబ్బే పొట్టికాదులెండి. మా అక్క కూతురు వచ్చిందిగా బొంబాయినించి. అది దెబ్బలాడి అన్నీ ఇల్లా కుట్టించింది.

వుండేది పట్నంట, జంతువుల్లా వుంటే ఎల్లా అంటూ సాధించి చంపేసింది. అంటూ రహస్యం బయట పెట్టింది కమల.

ఏమో బాబు అంత పొట్టిగా తొడుక్కుంటే సిగ్గెయ్యదా అంటూ కొంగు మెడచుట్టూ తిప్పుకుని ఆవలిస్తూ లోపలికి వెళ్ళింది తోటికోడలు.

కమల కిష్టమూర్తికేసి చూసింది. నిద్దర్రాల్లేదల్లే వుందే అని అడిగింది.

పుస్తకం మూసి ఎదురింటికేసి చూస్తున్నాడు. కిష్టమూర్తి.

సరే కూర్చోండి అంటూ విసురుగా లేచి లోపలికి వెళ్ళబోయింది. కుర్చీలోంచి వంగి కొంగు అందుకున్నాడు. గుంజుకుంటే చిరుగుతుందని కూలబడి విడిపించుకునే ప్రయత్నం చేసింది; పిల్లాడి ఏడుపు ఆయుధంలా పని చేసింది, కమలకి. కిష్టమూర్తికి పిల్లాడిమీద కోపమొచ్చింది. రాత్రి అంతా ఏడుస్తాడేమోనని భయం కూడా పట్టుకుంది. కమలకి అంతవోర్పు ఎవరు నేర్పారో. వాడితో ఏమిటి ఏమిటో మాట్లాడుతోంది. ముద్దెట్టుకుంటోంది.

బతిమాలుతోంది. నాయనే, అని గారాలు. పక్కమీద పడుకుని వింతగా వింటూ చూస్తున్నాడు

తెల్లవారకుండా పనిమనిషి కేకలకే కిష్టమూర్తి మెలుకొన్నాడు. కమల వెళ్ళింది.

వదిన ఏదో చెప్పబోయింది. మీరు వూరుకోండి అంటూ దగ్గరవుండి అన్నీ పురమాయిస్తోంది. చంటాడికి ఏం తొందరే, స్నానానికి అంటున్నా వినకుండా పోయించింది. పెద్ద వ్యవహారం తెలతెల్లారేసరికి ఇంట్లోపనేం కనబడకుండా పూర్తిచేయించింది.

మరో కొత్త చీర, జాకెట్టు ఎగ్జిబిషన్‌కి అన్నట్టు అలంకరించుకుని వరండాలో అటూ ఇటూ తిరుగుతోంది కమల.

అమ్మా తల్లీ ఇంకా ఎవరూ నిద్రమేల్కొని వుండరు, తమరి చీరను చూచి మెచ్చుకునేందుకు. కాస్త లోపలికి దయచేసి కాఫీ లాంటిది మరోసారి ఇచ్చుకోమని విన్నపం అంటూకిష్టమూర్తి దండకం మొదలెట్టాడు.

మెచ్చాను భక్తుడా అన్నట్టు కొద్దిగా నవ్వింది కమల. ఎదురింటి కిటికీలు పొద్దున్నే తెరచుకున్నాయి. పెద్దాకారం ఆయనవూచల్ని అంటుకున్నట్టు వొంగిచూస్తున్నాడు. అదేం జంతువండోయి అంటూ కమల పగలబడి నవ్వుతోంది.

కిష్టమూర్తి కళ్ళతో వద్దని వారించాడు.

కిష్టమూర్తికి ఆ రోజు ఆఫీసులో వుండబుద్ధిపుట్టలేదు తొందరగా ఇంటికి చేరాడు.

లోపల చాలా కంఠాలు వినబడుతున్నాయి. వరండా లోనే కూర్చున్నాడు.

వో పెద్దావిడ వెనకనించి కనబడుతోంది. మీ తోటి కోడలా. తెలియక అనుకొన్నాము ఆ పాపం మాకేకామోసు అని లెంపలేసుకుంటోంది.

పొట్టిగా, నల్లగా, వున్నావిడ. ఆ రోజు వాళ్ళు, వచ్చారుగా లోపలికి వచ్చి మాట్లాడ లేదుట. ఎంతసేపూ మొగాళ్ళ గొడవంటూ దవడలు నొక్కుకుంటుంది.

అదికాదర్రా ఇప్పుడు ఈ ఇళ్ళలోవున్న వోళ్ళ నోళ్ళు దగ్గర పడ్డాయి చూశారో లేదో.

నిన్న ఈవిడ రావటం అన్నమ్మమొగుడు చూశాడుట, తెగమెచ్చుకున్నాడు. దాంతో యివాళ మంచం దిగలేదు పాపం అన్నమ్మనే అరుణిమగారు.

అదే మనవల్ల రంభ పార్వతిలేద, మాట్లాళ్ళేదు చాలాసేపు. ఇందాక పైకిరా వెడదామంటే, ఏం చూడాలి లెద్దూ ఏదో ఎర్రతోలు అంతకంటే విశేషమేమి కనపడలేదు అంటూ మూతితిప్పింది. చుప్పనాతి ఆ నాయుడిభార్య అసలు మనుషులు మాట్లాడేందుకే తగదన్నట్టు ఎప్పుడూ ఆకాశంలోకి చూస్తూ నిల్చునేదా! మెగుడు కోప్పడ్డంతో మానేసిందిట. నిన్నా, ఇవాళ మెగుడు కిటికీని వదలకపోయేసరికి పెద్దగొడవపెట్టి కిటికీ తెరవనని వొట్టు పెట్టించిందట - పనిమనిషి చెప్పింది, అంటూ ఆశ్చర్యాన్ని బైట పెట్టింది ఇంటావిడ.

మాకీ గొడవలేవీ తెలీవుగా. ఏదో చిలోబాలోమంటూ వుండడం తప్ప అంటూ గతాన్ని మెచ్చుకొని ఈ కాలానికొచ్చింది ఈ పోకడలంటూ వెళ్ళే ప్రయత్నం చేసింది ఇంటావిడ.

ఇంతకీ కావ్యకన్య గడపలోపలికి రావటం చూసిన, వుపకన్యలు కళ్ళుకుట్టి ఆవేదన ఆకలి భరించలేక ఫలహారాలకి పనిమనిషిని పంపారు, అని నవ్వుతున్నావిడని తొంగిచూశాడు కిష్టమూర్తి వచ్చింది కాళిదాసుని కంఠస్తము చేసిన లలనామణే అని నిశ్చయం చేసుకున్నాడు. తీవిగా సాగనంపేందుకు వరండాలోకి వచ్చింది. కమల్లో గర్వం తొంగి చూసింది. ఇంటావిడ కిష్టమూర్తిని పలకరించి వున్న మాట చెబుతున్నాన్నాయనా. ఆ పిల్లని చూసినవేళేమో కాని, సొంతవాళ్ళలా అనిపిస్తోంది. నువ్వు వచ్చి ఎంతకాలమైనాది. బుద్ధి పుట్టాలా - అంటూ స్వగతం చెప్పుకు వెళ్ళింది.

కిష్టమూర్తి కమలవెనకే ఇంట్లోకి నడిచాడు. వచ్చి ఇంకా రెండురోజులు పూర్తిగానిండలేదు. అప్పుడేపటాలాన్ని చేర్చుకుంటున్నావే - అని కమల చెవి నలిపాడు.

మీరు కావ్యసుందర్లని చేరతీసినట్టు అదే పొరపాటు. కావ్యం పెరగాల్సినంత స్థూలంగా పెరగలేకపోయింది. సుందరులు కావ్యాలబరువు ఎక్కారు.

ఇంతకీ ఆ సుందరి ఎవరో తెల్సుకోవచ్చేమొ. కమల అంత వ్యంగ్యంగా మాట్లాడ్డం అదే మొదటి సారి విన్నాడు. సన్నగా తీగలాంటి అనుమానం మెరిసినట్టయింది. కిష్టమూర్తి చిన్నబోయింది. ఏదో దిగులుగా మొహం పెట్టి ఐతే నిజంగా తెల్సుకోవాలని వుందా?

కమలకి మొదట మాటరాలేదు. ఐతే ఎవరో వున్నారన్నమాట, వుడుక్కుంది. మొహం ఎరుపెక్కింది. అడక్కపోయినా బాగుండేదేమో. నిజం తెల్సుకోవాల్సిందే అన్న నిర్ణయంతో సామరస్యంలేని కంఠముతో పొడిగా చెప్పండి అంది.

ఏదో అపరాధం చేసిన వాడిలా కిటికీలోంచి చూశాడు. అటూ ఇటూ తిరిగాడు.

కమలకేసి అదోలా చూశాడు. చెప్పేందుకు అనుమానిస్తున్నట్టు జేబుల్లో చేతులుపెట్టి వెదికి ఏదో పైకి తీశాడు.

కమల వూపిరి వేగంగా తీస్తోంది. వరదనీటిని గట్టుదాటనివ్వనట్టు కళ్ళకొలుకులు నీటిని దాటకుండా ఆపుతున్నాయి. చెప్పండి అని అడగటంలో కంఠము వణికింది.

మరి ఏమి అనకూడదు. అంటూ ప్రాధేయపడ్డట్టు తల నిమిరాడు.

దగ్గరగా వున్న కమలతలని పైకెత్తాడు. ఏదో పుస్తకం లాంటి మడత కుడిచేత్తో విప్పాడు.

తనకి అన్యాయం చేసిన ఆమెను రక్కి చంపాలనివుంది. రక్తం వేగంగా తిరుగుతోంది. మెదడులో. ఆతృతగా తన చేతిలోకి తీసుకోబోయింది. అందనివ్వలేదు. కళ్ళు తడిసిన పువ్వులా కొట్టుకుంటున్నాయి. ఈసారి దొరికింది. గుండె వేగం ఎక్కువైంది తెరిచింది. ఏమీ కనబడటంలేదు. కళ్ళు తుడుచుకు మళ్ళీ చూసింది. అద్దం అది. తనే తన ఏడుపు మొహం మళ్ళీ చూసుకుంది అబద్ధం, నిజం చెప్పండి అంటూనే వెనక్కి తిరిగి నిల్చిన కిష్టమూర్తితో మొహం దాచుకు. దుఃఖం సంతోషం కలిసి వూపిరిని రానివ్వటంలేదు. మనస్సు సంతోషంతో బరువెక్కింది.

ఈ సారి కిష్టమూర్తి గట్టిగానవ్వి కమలని దూరంగా జరిపి పరాయి మనిషిని చూసినట్టు చూస్తున్నాడు.

సిగ్గుతో కళ్ళు వత్తుకుంది. బాగా నటిస్తావే అని నవ్వుతున్నాడు.

ఛా పొండి అంటూ బైటికి పారిపోయే కమల జడ కిష్టమూర్తికి దొరికింది.

కావ్యసుందరి జడ వర్ణించాలి అంటూ చేతిని చుట్టుకున్నాడు కిష్టమూర్తి.

అబ్బా ఎవరో పిలుస్తున్నారు అన్న వదిన కంఠము గుడిగంటలా మోగింది.

వాకిట్లోకి చూశాడు. క్షేమాలడిగే స్నేహితుడు మూర్తి "నువ్వా" యిల్లు ఎల్లా తెల్సింది పొడిప్రశ్న.

తెల్సుకోవాలంటే తెలియకేంచేస్తుంది - అంటూ ఏదో వెదుకుతున్నాడు కళ్ళతో. మా ఆవిడే అని కమలని పరిచయం చేశా. పనుందని వెళ్ళిపోయాడు - మరి క్షేమాలు తెల్సుకోడు - స్నేహితుడు...

✧